సాక్షి
పల్నాడు
మంగళవారం । 30 । జూలై । 2024



విద్యార్థికి అభినందనలు

బాపట్ల: పదో తరగతిలో 573 మార్కులు సాధించిన బాపట్ల సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ విద్యార్థి చేబ్రోలు అరవింద్‌ను కలెక్టర్ వెంకట మురళి సోమవారం అభినందించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 505 క్యూసెక్కులు వదిలారు.



వైభవంగా పవిత్రోత్సవాలు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆడి కృత్తిక పవిత్రోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి.

బిరబిరా కృష్ణమ్మ

సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు

- తెరుచుకున్న శ్రీశైలం క్రస్ట్ గేట్లు
- నాగార్జునసాగర్‌కు భారీగా పెరగనున్న వరద
- ఇన్‌ఫ్లో పెరగనున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తం
- 312 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం సాగర్‌లో 136 టీఎంసీలు
- శ్రీశైలం నుంచి సాగర్‌కు 54,772 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- సాగర్‌కు నీటి రాకతో ఊపందుకోనున్న ఖరీఫ్ సాగు



నాగార్జునసాగర్ డ్యాంలో ప్రస్తుత నీటి నిల్వ

సాక్షి, నరసరావుపేట: ఎగువ రాష్ట్రాల్లో రెండు వారాలుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ సోమవారం నుంచి నాగార్జున సాగర్‌వైపు పరుగులు తీస్తోంది. భారీ వరదనీటితో ఇప్పటికే ఆల్మట్టి, జూరాల, నారాయణపూర్, తుంగభద్ర డ్యాంలు నిండటంతో శ్రీశైలానికి వరదనీరు పోటెత్తుతోంది. శ్రీశైలం ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా సోమవారం సాయంత్రం 4 గంటలకు 878.9 అడుగులుగా ఉంది. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యాంలో 179.18 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సోమవారం సాయంత్రం 4 గంటలకు ఎగువున ఉన్న జూరాల, సుంకేసుల ద్వారా మొత్తం 4,51,080 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరుతోంది.

పెరుగుతున్న వరద ప్రవాహం..

ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తుండటం, ప్రాజెక్టులో నీటి నిల్వ గరిష్టస్థాయికి చేరువలో ఉండటంతో శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు తెరవాలని జలవనరుల శాఖ నిర్ణయించింది. సోమవారం మధ్యాహ్నం మూడు క్రస్ట్ గేట్లను తెరిచి స్పిల్‌వే ద్వారా 76,056 క్యూసెక్కుల వరదనీటిని సాగర్ వైపు మళ్లించారు. కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా సాగర్ వైపు 63,315 క్యూసెక్కులు దిగువకు వస్తోంది. పోతిరెడ్డిపాడు ద్వారా మరో 23 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. మొత్తంగా శ్రీశైలం నుంచి 1,63,689 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉంది. వరదనీటి ప్రవాహం గంటగంటకు బాగా పెరిగే అవకాశం ఉంది.

సాగర్‌లో 136 టీఎంసీలకు చేరిక..

నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, 312.045 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం ఉంది. సోమవారం సాయంత్రం 6 గంటలకు సాగర్‌లో నీటి మట్టం 512.6 అడుగులు వద్ద, 136.12 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన శ్రీశైలం నుంచి 54,772 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. శ్రీశైలంలో క్రస్ట్ గేట్ల ద్వారా వరదనీరు వదులుతుండటంతో ఇన్‌ఫ్లో గంట గంటకు పెరగనుంది. సాగర్ పూర్తిస్థాయిలో నిండటానికి మరో 176 టీఎంసీల నీరు అవసరం. ఇప్పటికే సాగర్ కుడికాలువ ద్వారా 5,944 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మరోవైపు సాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రానున్న నేపథ్యంలో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నారు.

రైతన్నలకు భరోసా...

కృష్ణానది ఎగువ పరివాహక ప్రాంతంలోని శ్రీశైలం ప్రాజెక్టుతో సహా అన్ని ప్రాజెక్టులు జల కళ సంతరించుకున్నాయి. ఇక మీదట వర్షం పడితే వచ్చే నీరంతా నాగార్జున సాగర్ రిజర్వాయర్‌లోకి వచ్చి చేరుతుంది. దీంతో ఈ ఏడాది సైతం తాగు, సాగు నీటికి ఇబ్బంది ఉండదు. కుడి కాలువ కింద ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలో 11.74 లక్షల ఎకరాలు, కృష్ణా, పశ్చిమ డెల్టాలో మరో 5.7 లక్షల ఎకరాల్లో సాగునీటికి భరోసా లభిస్తుంది. మరోవైపు పశ్చిమ డెల్టాకు గుండెకాయ లాంటి పులిచింతల ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి లభ్యత చాలా తక్కువగా ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 45.77 టీఎంసీలకు గాను కేవలం 1.09 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. కృష్ణానదికి ఇదేస్థాయిలో వరద మరో వారం రోజులు కొనసాగితే పులిచింతల ప్రాజెక్టుకు సైతం వరదనీరు భారీగా వచ్చే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

164 ఆస్పత్రుల్లో స్కాన్ సెంటర్లకు అనుమతి



నరసరావుపేట: జిల్లాలో ఇప్పటివరకు 164 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ చట్టం పరిధి కింద స్కాన్ సెంటర్లకు అనుమతులు ఇచ్చామని వీరందరూ చట్టం ప్రకారం అన్ని రికార్డులు నిర్వహించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. నూతనంగా జిల్లాలో ఏడు స్కాన్‌సెంటర్ల కోసం, మూడు రెన్యువల్, ఎనిమిది మార్పులకోసం దరఖాస్తులు అందజేశారని, తనిఖీలు నిర్వహించి కలెక్టర్‌కు నివేదించి ఆయన అనుమతితో లైసెన్స్‌లు మంజూరు చేస్తామని అన్నారు. సోమవారం పల్నాడురోడ్డులోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సంబంధిత కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో లింగ నిర్ధారణ చట్టం–1994ను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ చట్టం పరిధిని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లింగనిర్ధారణ చేయటం చట్టరీత్యా నేరమని, చేసినట్లు రుజువైతే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.గీతాంజలి, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.పద్మావతి, డీఎల్‌ఓ కె.మురళీకృష్ణ, డెప్యూటీ డెమో కె.సాంబశివరావు, వైద్యులు పాల్గొన్నారు.

కర్లపూడి వీఆర్‌ఓ రమేష్ సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్


నరసరావుపేట: అమరావతి మండలం కర్లపూడి గ్రామ రెవెన్యూ అధికారి ఎ.రమేష్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంతో పాటు ఇసుక లారీల నుంచి అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్న వైనంపై నిర్వహించిన విచారణ అనంతరం సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

బంగారు తాపడం పనులకు రూ.5 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు గుంటూరుకు చెందిన భక్తులు రూ.5 లక్షల విరాళం సమర్పించారు. గుంటూరుకు చెందిన ఎస్.సాయివీణ కుటుంబ సభ్యులు సోమవారం దుర్గమ్మ దర్శనానికి ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి బంగారు తాపడం పనులకు రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఈఈ కె.వి.ఎస్.కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

యార్డుకు 40,891 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 40,891 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 36,353 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,500 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,400 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 15,748 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సమస్యలు అధిగమించి ప్రగతి సాధిద్దాం

- అధికారులతో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 96 వినతుల స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న సమస్యలను అధిగమించి, ప్రగతిని సాధించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 96 అర్జీలను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. శ్రద్ధ, అంకితభావంతో పనిచేసి జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, జిల్లాలో దృష్టి సారించాల్సిన అంశాలపై శ్రద్ధ వహించాలన్నారు. ప్రత్యేక అధికారులు వారంలో ఒకరోజు సచివాలయాలు, పాఠశాలలు, హాస్టళ్లు, రైతు సేవా కేంద్రాలు, ప్రభుత్వాసుపత్రులు తనిఖీలు చేసి, సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా కృషిచేయాలని ఆదేశించారు.

వైదొలగాలని టీడీపీ నేతలు ఒత్తిడి చేస్తున్నారు

అమరావతి మండల పరిధిలోని యండ్రాయి, చావపాడు, వైకుంఠపురం గ్రామాల్లో డ్వాక్రా గ్రూపు యానిమేటర్లుగా పనిచేస్తున్న మమ్మల్ని అధికార టీడీపీ నాయకులు వైదొలగాలని మానసికంగా ఒత్తిడి చేస్తున్నారు. మా పై అధికారులకు ఫోన్‌చేసి తొలగించాలని వేధిస్తున్నారు. మేమందరమూ దళితులు కాబట్టి తొలగించే కుట్ర చేస్తున్నారు. మాకు వారి వేధింపులు తొలగించి, ఉద్యోగ భద్రత కల్పించండి.

– అమరావతి మండలంలోని పలు గ్రామాల యానిమేటర్లు

ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ పూర్తిచేయాలి..

జిల్లాలోని పింఛనుదారులందరికీ ఆగస్టు ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ కావాలని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అందుబాటులో లేని లబ్ధిదారులకు రెండవ తేదీన పింఛన్లు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో 1,2 తేదీల్లో మొత్తం పింఛన్లు పంపిణీ కావాలని, ఈ విషయాన్ని ప్రతి గ్రామం, వార్డులో ముందస్తు ప్రచారం చేపట్టాలని అన్నారు. పింఛను డబ్బులను ఈ నెల 31న డ్రా చేసి సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు ఒకటో తేదీ ఉదయం 5గంటల నుంచే పింఛన్లు ప్రారంభించాలన్నారు. డీఆర్‌ఓ కె.వినాయకం, డీఎల్‌డీఓ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'విశ్వకర్మ' దరఖాస్తుల పరిశీలన పూర్తిచేయండి

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు అందిన దరఖాస్తుల పరిశీలన రెండు రోజుల్లోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు జిల్లాలో అందిన 52,112 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పరిశీలించి, పూర్తి చేయాలన్నారు. కమిటీ ద్వారా పథకానికి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. 18 రకాల వృత్తుల్లో నిమగ్నమైన వారికి నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక తోడ్పాటును కల్పించే ఈ పథకం ద్వారా వీలైనంత ఎక్కువ మందికి లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. ఇన్‌చార్జి జిల్లా పరిశ్రమల అధికారి సుధాకర్, ఎల్‌డీఎం రాంప్రసాద్, డీఆర్డీఏ పీడీ బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పనులు.. పస్తులు

ఊసేలేని ఉపాధి హామీ వేతనాలు

- రెండున్నర నెలలుగా ఎదురు చూపులే
- కూలి డబ్బులు అందక కూలీల ఇక్కట్లు
- పెరిగిన నిత్యవసరాలతో తిండికి తిప్పలు
- జిల్లాలో రూ. 50.57 కోట్లకు పైగా బకాయిలు



యడవల్లి గ్రామంలో పంట కుంటల పనుల్లో ఉపాధి కూలీలు

జిల్లాలో జాబు కార్డులు :	3.23 లక్షలు
యాక్టివ్ జాబ్ కార్డులు :	2.58 లక్షలు
సభ్యత్వం కలిగిన కూలీలు :	5.55 లక్షలు
పనిచేసే కూలీల సంఖ్య :	4.38 లక్షలు
మే 21 నుంచి కూలీలకు రావాల్సిన బకాయిలు	
మొత్తం :	రూ.50.57 కోట్లు

సత్తెనపల్లి: జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలు వేతనాల కోసం రెండున్నర నెలలుగా ఎదురు చూడాల్సి వస్తోంది. దీంతో పనులు చేసినా పస్తులు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని కూలీలు ఆవేదన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా రూ. 50.57 కోట్ల మేర వేతన బకాయిలు కూలీలకు రావాల్సి ఉంది. పనులు చేసి పది వారాలు గడుస్తున్నా వేతనాలు అందకపోవడంతో కూలీలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉపాధి పనులు చేసే కూలీలకు ఏ వారంలో ఎంతపని చేసి ఉంటే దానికి సంబంధించిన మొత్తం వేతనం వారి ఖాతాల్లో నేరుగా జమ అయ్యేవి. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులు విడుదలయ్యేవి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పీఎఫ్‌ఎంఎస్ ద్వారా కూలీలకు నేరుగా చెల్లింపులు చేస్తోంది. మే 21 నుంచి ఈరోజు వరకు కూలీలకు చెల్లించాల్సిన సొమ్ము మొత్తం పెండింగ్‌లో ఉంది.

ఎన్నికల వరకు సకాలంలో వేతనాలు...

ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయం వరకు కూలీల వేతనాలు మూడు, నాలుగు రోజుల్లోనే వారి ఖాతాల్లో జమ అవుతుండడంతో గత రెండు నెలల్లో ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు ఆసక్తి చూపారు. దీంతో కొంతమేర పనిచేసిన కూలీల సంఖ్య కూడా పెరిగింది. అయితే రెండున్నర నెలలుగా వేతనాలు చెల్లింపులు పూర్తిగా నిలిచిపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వారంతా వాపోతున్నారు. జిల్లాలో కూలీలకు సంబంధించి కొన్ని ప్రాంతాల్లో బ్యాంకుల ద్వారా ఎక్కువగా పోస్ట్ ఆఫీస్‌ల ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారు. దీంతో తమ డబ్బులు ఖాతాల్లో జమ అయ్యాయో లేదోనని ఆందోళనతో నిత్యం వాటి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. మరికొన్ని చోట్ల కూలీలు డబ్బులు కోసం క్షేత్ర సహాయకుల ఇళ్లతో పాటు మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

పేరుకుపోయిన వేతన బకాయిలు ...

జిల్లాలో 28 మండలాల్లోని 531 గ్రామపంచాయతీలో యాక్టివ్ జాబ్ కార్డులు 2.56 లక్షలు కాగా పనికి వచ్చే కూలీలు 4.38 లక్షల మంది ఉన్నారు. ఉపాధి హామీ పథకంలోని చట్టం ప్రకారం కూలీలు పనిచేసిన 21 రోజుల్లోనే వేతనాలు అందించాలి. కానీ పది వారాలు అయినా చేసిన పనులకు సంబంధించిన వేతనాలు అందడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు రూ.50.57 కోట్లకు పైగా కూలీల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి.

వేతనాలు చెల్లించకపోతే ఎలా బతకాలి



వలసలు నివారించటానికి గ్రామాల్లో ఉన్న పేదలకు పని చేసిన వారం రోజుల్లోనే డబ్బులు ఇవ్వాలని చట్టం చెబుతుంది. 15 రోజులు దాటితే వడ్డీ చెల్లించాలనేది చట్టం నిబంధన. కానీ 10 వారాలైనా వేతనాలు చెల్లించకపోతే ఆ పేద కుటుంబాలు ఎలా బతకాలనేది ప్రభుత్వం ఆలోచించాలి. కేంద్ర ప్రభుత్వం వెంటనే వేతన బకాయిలు విడుదల చేయాలి. వాటిని ఇతర అవసరాలకు మళ్లించకుండా ఉపాధి కూలీలకు చెల్లించాలి. 200 రోజులు పని కల్పించాలని కూలీలు కోరుతుంటే 100 రోజులు కూడా పనులు కల్పించకపోవడం అన్యాయం.

–గుంటూరు విజయ్‌కుమార్, సీఐటీయూ ఉపాధ్యక్షుడు, పల్నాడు

త్వరలో విడుదలవుతాయి



జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు సంబంధించిన వేతనాలు మే 21 నుంచి రావడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్ అప్రూవల్ చేసింది. పనులు చేసిన కూలీలందరికీ వారం పది రోజుల్లో వస్తాయని చెప్పారు. ఈ విషయంలో కూలీలు ఆందోళన చెందాల్సిన పనిలేదు. బడ్జెట్ విడుదల కాగానే వారి ఖాతాలకు వేతనాలు వెంటనే జమ చేయడం జరుగుతుంది.

–జి.జోసఫ్‌కుమార్, పీడీ, డ్వామా, పల్నాడు

'శుభదిన్ భోజన్'కు తోడ్పాటు అందించాలి



రెంటపాళ్ల జడ్పీ హెచ్‌ఎస్‌లో విద్యార్థులకు వడ్డిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు

సత్తెనపల్లి: జిల్లాలో శుభదిన్ (తిథి) భోజన్‌కు దాతలు తోడ్పాటును అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శిక్ష సప్తాహ్ ముగింపులో భాగంగా సోమవారం తిథి భోజనాలు, విద్యార్థులతో పెద్దలు, ఉపాధ్యాయుల సహపంక్తి భోజనం కార్యక్రమాలను సత్తెనపల్లి యానాది కాలనీలో గల ఎంపీపీఎస్ పాఠశాల, సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమానికి అందరూ తోడ్పాటును అందించాలన్నారు. పాఠశాలలో భర్తీ కాకుండా ఉన్న రెండు ఖాళీలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామన్నారు. పాఠశాలకు 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయ బృందంతో సంభాషించారు. తొలుత ఎంఈఓలు ఎ.శ్రీనివాసరావు, ఎ.రాఘవేంద్రరావు, పాఠశాల హెచ్‌ఎం గోపరాజు బసవరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ మక్కపాటి రామచంద్రరావు, చెన్నమల్లు వెంకయ్య తదితరులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పట్టణంలోని యానాది కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో శుభదిన్(తిథి) భోజన్‌కు సహకరించిన దాత షేక్ నజీర్ అహ్మద్‌ను డీఈఓ వెంకటేశ్వర్లు సత్కరించారు. యానాదికాలనీ ఎంపీపీఎస్ పాఠశాల హెచ్‌ఎం రోజారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో శాస్త్రీయ దృక్పథం

- మద్దిరాల నవోదయలో శాస్త్రీయ వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు ప్రారంభం
- రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాలకు చెందిన జేఎన్‌వీ విద్యాలయాలు హాజరు
- 57 నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులు



విద్యార్థులు చేసిన సైన్స్ కృత్యాలను తిలకిస్తున్న అతిథులు



సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని సీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. జవహర్ నవోదయ విద్యాసమితి ఆధ్వర్యంలో నిర్వహించే క్లస్టర్‌స్థాయి శాస్త్రీయ, వైజ్ఞానిక పోటీలు పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలంలోని మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో సోమవారం ఏర్పాటయ్యాయి. రెండురోజుల నిర్వహించే ఈ పోటీల్లో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రదర్శన ఆడిటోరియంను ప్రారంభించగా, మరో అతిథి ధనలక్ష్మి గ్రూప్స్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఎం.లింగయ్యచౌదరి వేదికపై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ జీవితాన్ని, ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంచుకుని విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు, సమాజానికి ఆయా అంశాలను తెలిపి జాగృతం చేయాలన్నారు. క్లస్టర్ స్థాయి పోటీల్లో విజేతలైనవారు త్వరలో కేరళలో జరిగే ప్రాంతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన...

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, యానాం, తూర్పుగోదావరి –1, 2, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని జవహర్ నవోదయ విద్యాలయాలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు తరలిరావడంతో మద్దిరాల జేఎన్‌వీ ప్రాంగణం కళకళలాడింది. గణితం, కంప్యూటర్ సైన్స్, జీవ, రసాయన, సామాజిక, విజ్ఞానశాస్త్రాలు, ఎస్‌యూపీడబ్ల్యూ అంశాల్లో 57 నమూనాలను పోటీల్లో ప్రదర్శించారు. అతిథులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఆయా ప్రాజెక్టులను ఎంతో ఆసక్తిగా తిలకించారు. పలు అంశాలపై రూపొందించిన ఆయా ప్రాజెక్టుల ప్రయోజనాలను విద్యార్థులు వివరించారు.

క్లుప్తంగా

పాటిబండ్లలో చారిత్రక ఆనవాళ్లు



పెదకూరపాడు: మండలంలోని పాటిబండ్ల గ్రామ నైరుతి దిశలో ఉన్న కొండపై ఉన్న మల్లేశ్వర ఆలయ ప్రవేశ ద్వారం కుడివైపున కొత్త శాసనాన్ని సోమవారం పురావస్తు ఔత్సాహిక పరిశోధకులు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి, మణిమేల శివశంకర్‌లు పరిశీలించారు. పాటిబండ్ల కారుణ్య ఆశ్రమం నిర్వాహకులు డాక్టర్ అల్లం ఇన్నారెడ్డి గ్రామ చరిత్ర పుస్తక రచనకోసం ఈ పరిశోధన నిర్వహించారు. ఈసందర్భంగా పురావస్తు పరిశోధకులు మణిమేల శివశంకర్, పాములపాటి శ్రీనాథ్ రెడ్డిలు మాట్లాడుతూ కొండపై ఉన్న శాసనం లిపి 17–18వ శతాబ్దం నాటిదని రెండు పంక్తుల్లో ఉన్న ఈ శాసనంలో గోపాపాత్రుని కుమారుడైన కొండముడు అనే వ్యక్తి గుర్రాన్ని ఈ కొండ పడమట దిక్కుగా ఎక్కించి తూర్పుదిక్కుగా నడియాడాడని ఉందని తెలిపారు. అలాగే గ్రామ శివారు పొలాల్లో క్రీ.పూ 2000 సంవత్సరాల నాటి కొత్తరాతి యుగం రాతి పనిముట్లు, 14వ శతాబ్దం నాటి మహిషాసుర మర్దిని విగ్రహం మరియు 16వ శతాబ్దం నాటి ఆంజనేయ విగ్రహాన్ని గుర్తించారు. ఈ పురాతన ఆనవాళ్లను భద్రపరిచి భావితరాలకి అందించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2700, గరిష్ట ధర రూ.4000, మోడల్ ధర రూ.3500 వరకు పలికింది.

మోసపోయాం.. న్యాయం చేయండి

- జిల్లా పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఆశ్రయించిన బాధితులు
- ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలుమూలల నుంచి బాధితులు పోటెత్తారు. పలు సమస్యలపై అర్జీలు అందజేశారు.



బాధితుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

సోదరి 4 ఎకరాలు రాయించుకుంది..



నాకు అనారోగ్యం కారణంగా రెండు కళ్లు కన్పించకుండా పోయాయి. నాకు ఐదెకరాల పొలం ఉంది. కళ్లు కన్పించని నాకు నా సోదరి అంజమ్మ మాయమాటలు చెప్పి నాలుగు ఎకరాలు రాయించుకుంది. నా పొలం నాకు ఇప్పించి న్యాయం చేయండి.

– కేసరి శ్రీనివాసరెడ్డి, అంధుడు, మాచవరం, రొంపిచర్ల మండలం

వీసా పేరుతో రూ.3.50లక్షలు కాజేశారు

హైహై కన్సెల్టెన్సీ అనే పేరుతో గుత్తికొండకు చెందిన బ్రహ్మం అనే వ్యక్తి కన్సెల్టెన్సీని నిర్వహిస్తూ వీసా ఇప్పించేందుకు రూ.7లక్షలు ఖర్చు అవుతుందని, అందులో సగం ముందు చెల్లించాలంటూ నా వద్ద నుంచి రూ.3.50లక్షలు తీసుకున్నాడు. వీసా మంజూరు చేయలేదు. డబ్బులు తిరిగి ఇవ్వలేదు. న్యాయం చేయండి.

–పఠాన్ అబ్దుల్ ఖాదర్, పెద్దమసీదు, పిడుగురాళ్ల

నమ్మించి రూ.లక్ష కాజేశాడు

నరసరావుపేటలోని ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేసే శివరామకృష్ణ అనే వ్యక్తి బ్యాంకులో రుణం ఇప్పిస్తానని నా వద్ద నుంచి ఇంటి పన్ను రసీదు, విద్యుత్ బిల్లు రసీదు తీసుకున్నాడు. బ్యాంకు దగ్గరకు తీసుకెళ్లి సంతకాలు పెట్టించి రూ.1.50లక్షలు తీసుకొని బయటకు వచ్చి నాకు రూ.50వేలు ఇచ్చాడు. దీనికి నూటికి రెండురూపాయలు వడ్డీ చెల్లించాలని, మిగతా రూ.లక్ష తాను తీసుకొని నెలకు రూ.4 వడ్డీ చెల్లిస్తానని, మీకు నోటు రాసిస్తానంటూ నమ్మబలికి డబ్బు కట్టకుండా మోసం చేశాడు. అతనిపై చర్యలు తీసుకుని, నా నగదు నాకు ఇప్పించండి.

– పొట్టి శౌమ్య, రూపెనగుంట్ల, నకరికల్లు మండలం

ఉద్యోగం వస్తుందని నమ్మబలికి పెళ్లి చేసుకున్నాడు

ఆకాష్‌బాబు అనే వ్యక్తి తనకు సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం వస్తుందని, తన చెల్లెలు కూడా ఎస్ఐనే అంటూ వాళ్ల తల్లిదండ్రులు సైతం నమ్మబలికి రూ.12లక్షలు కట్నం ఇచ్చేలా మాట్లాడుకొని నన్ను వివాహం చేసుకున్నాడు. వివాహానికి ముందే రూ.6 లక్షలు తీసుకున్నారు. వివాహం అనంతరం రూ.6 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నాం. వివాహమైన తర్వాత ఆకాష్‌బాబుకు ఎటువంటి ఉద్యోగం రాలేదు. మోసంచేసిన ఆకాష్‌బాబు, అతని తల్లిదండ్రులపై చర్యలు తీసుకోండి.

– ఓ మహిళ, క్రిస్టియన్‌పాలెం, నరసరావుపేట

ర్యాగింగ్ ఘటనలో మరో నిందితుడు అరెస్ట్

నరసరావుపేట టౌన్: ఎన్‌సీసీ విద్యార్థిపై దాడి కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల వసతి గృహంలో జూనియర్ ఎన్‌సీసీ క్యాడెట్‌పై సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో పైశాచికంగా దాడికి పాల్పడిన సంఘటన విదితమే. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేయగా ఆరవ నిందితుడు అజయ్‌ను తాజాగా అరెస్ట్ చేశారు.

పల్నాడులో బహుజనులు బతకడం ఇష్టం లేదా?

- బహుజనులు ఐక్యంగా ఉండి దాష్టీకాలను ఎదిరించాలి
- బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్, రిటైర్డ్ డీఐజీ పూర్ణచంద్రరావు



మాచర్ల: దశాబ్దాలుగా రాజకీయంగా, సామాజికంగా బహుజనులు బహిష్కరణకు గురై పల్నాడులో పూర్తిస్థాయి ఉనికి కోల్పోయే దిశలో ఉండటం బాధాకరమని బీఎస్పీ రాష్ట్ర కో–ఆర్డినేటర్, రిటైర్డ్ డీఐజీ పూర్ణ చంద్రరావు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో సూర్యకిరణ్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక విద్యాలయంలో సోమవారం జరిగిన బహుజన సమాజ్ పార్టీ పల్నాడు జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు సామాజిక వర్గాలు ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ రాజకీయ సామాజిక బహిష్కరణలకు బహుజనులను బలి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బహుజనులపై కత్తి దూసే సంస్కృతి ఇప్పటికీ మారలేదన్నారు. అగ్రవర్ణాల పార్టీలవారు బహుజనులకు రాజకీయ ప్రాధాన్యత లేకుండా చేస్తున్నారన్నారు. ఈ చరిత్ర మారాలనే ఉద్దేశంతో బీఎస్పీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేయనున్నామన్నారు. బహుజన నాయకుడు పరంజ్యోతి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వి.కుమార్‌లు ప్రసంగించారు. ఇప్పటికైనా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం వర్గాలు వారిలోవారు ఘర్షణలు పడడం మానివేసి, ఐక్యంగా పాలకుల దుర్మార్గాలను ఎదిరించాలన్నారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, రాష్ట్ర అధికార ప్రతినిధి వందనకుమార్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు బి.బాబు రావు, జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ సైదులు యాదవ్‌లు పాల్గొని మాట్లాడారు.

ప్రిన్సిపాల్‌పై దాడికి యత్నించిన పాలకవర్గ సభ్యుడు!

- ఎస్ఎస్అండ్ఎన్ కళాశాలలో ఘటన
- ఘటనపై నోరెత్తని ప్రిన్సిపాల్
- అందుబాటులోకి రాని పాలకవర్గ సభ్యుడు

నరసరావుపేట టౌన్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాగింగ్ ఘటన కళాశాలలోని అంతర్గత కుమ్ములాటలను ఒక్కసారిగా బహిర్గతం చేసింది. ఈనెల 24వ తేదీన ర్యాగింగ్ వీడియో వెలుగులోకి వచ్చినప్పటి నుంచి ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో పాటు హాస్టల్ వార్డెన్‌గా, ఎన్‌సీసీ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న అధ్యాపకునిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ రాష్ట్రవ్యాప్తంగా వినవచ్చింది. ర్యాగింగ్ ఘటనలు ప్రతి ఏడాది సర్వసాధారణంగా జరుతూనే ఉన్నాయని బాధిత విద్యార్థులు పేర్కొనటంతో ఇన్నేళ్లుగా కొనసాగుతున్న ర్యాగింగ్‌ను గుర్తించకపోవటంతో సదరు అధ్యాపకుడు విధి నిర్వహణలో విఫలమయ్యారనే వాదనలు వినవస్తున్నాయి.

ఇదిలా ఉండగా ర్యాగింగ్ ఘటనపై సరైన చర్యలు తీసుకోవలసిన యాజమాన్యం అంతర్గత విభేదాలతో కుమ్ములాటలకు దిగినట్టు తెలియవచ్చింది. కళాశాలలో విధి నిర్వహణలో ఉన్న ప్రిన్సిపాల్‌పై సోమవారం కళాశాల పాలకవర్గ సభ్యుడు దాడికి పాల్పడినట్టుగా ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ఉదయం కళాశాలకు వచ్చిన సదరు సభ్యుడు నేరుగా ప్రిన్సిపాల్ చాంబర్‌కు వెళ్లి సీట్లో కూర్చొని ఉన్న ప్రిన్సిపాల్‌ను దుర్భాషలాడుతూ వెంటనే కళాశాలను వదిలి వెళ్లాలని హుంకరించినట్టు సమాచారం. అంతటితో ఆగని ఆ సభ్యుడు ప్రిన్సిపాల్‌ను సీట్లో నుంచి బయటకు లాగుతూ దురుసుగా ప్రవర్తించాడని తెలిసింది. దీంతో బిత్తరపోయిన ప్రిన్సిపాల్ ఇది సరైన పద్ధతి కాదంటూ సర్దిచెబుతున్నప్పటికీ సదరు సభ్యుడు మరింత రెచ్చిపోయి ఇది మా కళాశాల.. నువ్విక్కడ ఉండటానికి వీల్లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేయటం జరిగింది. ఆసమయంలో అక్కడ ఉన్న సిబ్బంది నచ్చచెప్పేందుకు ప్రయత్నించినప్పటికీ సదరు సభ్యుడు శాంతించలేరు. ప్రిన్సిపాల్ సీట్లో నీవు ఎలా ఉంటావో చూస్తానంటూ హెచ్చరించి వెళ్లిపోయినట్టు తెలిసింది. దీనిపై కళాశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ఈ వివాదాన్ని ఇంతటితో వదిలివేయాలని, కమిటీ కళాశాల కావటంతో తానేమీ మాట్లాడలేనని తెలిపారు. పాలకవర్గ సభ్యుడు అందుబాటులోకి రాలేదు.

అటవీశాఖ అధికారులపై దాడి

- అలుగును స్మగ్లింగ్ చేస్తున్న ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్న ఫారెస్ట్ అధికారులు
- గొట్టిపాళ్ల వద్ద వాహనంపై దాడి చేసిన దుండగులు
- అధికారులకు గాయాలు

వెల్దుర్తి: అలుగును స్మగ్లింగ్ చేస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకొని మాచర్లకు తరలిస్తుండగా మండలంలోని గొట్టిపాళ్ల వద్ద అటవీ శాఖాధికారుల వాహనాన్ని అడ్డుకొని రాళ్లు, కర్రలతో దాడి చేసి గాయపర్చిన సంఘటన సోమవారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం హనుమాపురం తండాకు చెందిన వాంకణావత్ గోవిందు నాయక్ నాలుగు రోజుల కిందట అటవీ ప్రాంతంలో తిరుగుతున్న అలుగును బంధించి తండాలోని ఓ గృహంలో దాచి ఉంచాడు. ఈ అలుగును కొనుగోలు చేసేందుకు విజయవాడ, భద్రాద్రి కొత్తగూడెం, చిలకలూరిపేట, కారెంపూడిలకు చెందిన నలుగురు వ్యక్తులు హనుమాపురంతండాలో ఓ గృహంలో సమావేశమైన విషయాన్ని తెలుసుకున్న విజయపురిసౌత్ ఫారెస్టు రేంజ్ అధికారి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది ఆ గృహంపై దాడి చేశారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని మాచర్ల తరలిస్తుండగా గ్రామానికి చెందిన గోవిందునాయక్ బంధువులు అటవీ శాఖాధికారుల వాహనాన్ని అటకాయించి వారిని తప్పించేందుకు యత్నించారు. అక్కడ నుంచి వాహనాన్ని చాకచక్యంగా తప్పించి వస్తుండగా మార్గంమధ్యలో గంగలకుంట, గొట్టిపాళ్ల గ్రామాల మధ్య రోడ్డుపై ద్విచక్రవాహనాన్ని అడ్డుపెట్టారు. అటవీశాఖాధికారులు వాహనాన్ని నెమ్మదిగా పోనిస్తుండగా రోడ్డుకు ఇరువైపుల నుంచి వ్యక్తులు వాహనంపై బండరాళ్లు విసరటంతో వాహనం ముందు అద్దం పగలగా, జీపు పట్టాలు చినిగిపోయాయి. డ్రైవర్ వాహనాన్ని అక్కడ నుంచి తప్పించి గొట్టిపాళ్ల దాటుతుండగా వాహనానికి ముందు 10 మంది, వెనక నుంచి 10 మంది ఒక్కసారిగా రాళ్లు, కర్రలతో దాడికి దిగారు. ఈ దాడిలో వాహనంలో ప్రయాణిస్తున్న ఫారెస్టు రేంజ్ అధికారి సత్యనారాయణరెడ్డి, సెక్షన్ ఆఫీసర్ మహేష్‌బాబులు తీవ్రంగా గాయపడ్డారు. అక్కడ నుంచి వాహనాన్ని మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వీరికి ప్రథమ చికిత్స చేశారు.



గాయపడిన ఫారెస్టు రేంజ్ అధికారి సత్యనారాయణరెడ్డి



అటవీ శాఖాధికారుల వాహనం అద్దం ధ్వంసమైన దృశ్యం

వెల్దుర్తి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు

తమపై హనుమాపురంతండాకు చెందిన గోవింద్‌నాయక్ బంధువులు కొండా నాయక్, మంత్రునాయక్‌ల ఆధ్వర్యంలో గొట్టిపాళ్ల వద్ద తమ వాహనానికి ఇరువైపులా రాళ్లు, కర్రలతో దాడులు చేసి తీవ్రంగా కొట్టారని అటవీ శాఖాధికారి మహేష్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహేష్‌బాబు ఫిర్యాదు మేరకు మాచర్ల రూరల్ సీఐ కె.సురేష్, వెల్దుర్తి ఎస్ఐ సత్యనారాయణలు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్నేషనల్ వాలీబాల్ కోచ్ కోర్సుకు మైదవోలు వాసి

రెండు దశల శిక్షణను పూర్తి చేసుకున్న నక్కా శ్రీనివాస్

యడ్లపాడు: అంతర్జాతీయ వాలీబాల్ కోచ్ కోర్సు రెండోదశ శిక్షణకు దేశం నుంచి ఆరుగురు వ్యక్తులు ఎంపికవగా, వీరిలో యడ్లపాడు మండలం మైదవోలు గ్రామానికి చెందిన నక్కా శ్రీనివాస్ ఒకరు. అందులోనూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి ఎన్నికైన ఏకైక వ్యక్తి కావడం విశేషం. నక్కా శ్రీనివాస్ తొలుత 2022లో అంతర్జాతీయ స్థాయి వాలీబాల్ కోచ్‌కోర్సులో శిక్షణ పొందేందుకు అవకాశం లభించింది. దానిని పూర్తి చేశాక తిరిగి వాలీబాల్ అండర్ –19(బాలుర) విభాగంలో 2023 ఏపీకి, 2023న ఏఎన్‌యూ జట్టు కోచ్‌గా వ్యవహరించారు. కోచ్‌గా క్రీడాకారుల నైపుణ్యాల్ని మెరుగు చేయడంలో కృతకృత్యుడు కావడంతో ఇంటర్నేషనల్ వాలీబాల్ కోచ్‌కోర్సు రెండోదశకు ఎంపికయ్యాడు. ఈ రెండోదశ కోచ్‌కోర్సుకు భారత్‌నుంచి 150 మంది ప్రయత్నించగా, ఆరుగురికి మాత్రమే అవకాశం వరించింది. ఇటీవల థాయ్‌ల్యాండ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ స్థాయి వాలీబాల్ కోచ్ కోర్సు శిక్షణను దిగ్విజయంగా పూర్తి చేసుకుని శ్రీనివాస్ తిరిగివస్తున్న సందర్భంగా సోమవారం మండల బీజేపీ నాయకులు అభినందించారు. భవిష్యత్తులో వాలీబాల్ శిక్షకులను మెరుగుపరిచి భావి క్రీడాకారుల్ని తీర్చిదిద్దడంలో తనవంతు కృషి చేసి దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో బీజేపీ నాయకులు వేగేశ్న అంజిరాజు, తులాబంధు సత్యనారాయణ, దాట్ల వెంకటేశ్వరరాజు తదితరులు ఉన్నారు.



థాయ్‌ల్యాండ్‌లో శిక్షణ పూర్తి చేసుకుని ధ్రువపత్రాన్ని అందుకుంటున్న నక్కా శ్రీనివాస్

ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు

విత్తనాల షాపులను తనిఖీ చేసిన వ్యవసాయాధికారులు

నరసరావుపేట రూరల్: ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారులు విత్తన షాపుల నిర్వాహకులను హెచ్చరించారు. సోమవారం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సీహెచ్ రవికుమార్, నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ స్టేషన్‌రోడ్డులోని విత్తన షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, విత్తనాల సోర్స్ సర్టిఫికెట్లు పరిశీలించారు. విత్తనాలు తీసుకున్న రైతులు ఖచ్చితంగా బిల్లును తీసుకోవాల్సిందిగా కోరారు. బిల్లు బుక్‌లో రైతుల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని, ధరలతో కూడిన బోర్డును తప్పనిసరిగా రాసి ఉంచాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు.



స్టేషన్‌రోడ్డులోని విత్తన షాపును తనిఖీచేస్తున్న వ్యవసాయాధికారులు

పారిశుద్ధ్య కార్మికురాలి ఆత్మహత్యాయత్నం

లైంగిక వేధింపులే కారణమా?

పొన్నూరు: పురపాలక సంఘం పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు లైంగిక వేధింపుల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు..గుంటూరు జిల్లా పొన్నూరు పురపాలక సంఘం ఉన్నతాధికారి నివాసంలో పారిశుద్ధ్య కార్మికురాలు ఏడాది కాలంగా పనిచేస్తోంది. ఆమె కొంతకాలంగా అధికారి లైంగిక వేధింపులకు గురైనట్లు సమాచారం. వేధింపులకు తట్టుకోలేక పది రోజుల కిందట ఆ అధికారి నివాసంలో పనికి వెళ్లేందుకు ఆమె నిరాకరించింది. మూడు రోజుల కిందట ఆమె ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఉన్నతాధికారులు జరిగిన సంఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆయన గతంలోనూ విధులు నిర్వహించిన వేరే ప్రాంతంలో కూడా పారిశుద్ధ్య కార్మికుల నుంచి లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుమలశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ కుటుంబ కలహాల నేపథ్యంలో కార్మికురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలిపారు. ఆమె గతంలో మున్సిపల్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ కమిషనర్ నివాసంలో పనిచేసినట్లు పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘానికి అధ్యక్షునిగా కంకణాల వెంకట సుధీర్, కార్యదర్శిగా డాక్టర్ దొడ్డక శివరామకృష్ణ, కోశాధికారిగా లంకపల్లి సాంబశివరావు, ఉపాధ్యక్షులుగా టి.సుబ్రమణ్యం, సయ్యద్ అనీషా బేగం, జాయింట్ సెక్రటరీస్‌గా ఎం.శిరీష, జి.రజత, ఎల్. సౌమ్య కార్యవర్గ సభ్యులుగా యు.అన్నామణి, జి.శాంతరాజు, ఎ. మణి, కె.కిషోర్. ఎం.అన్నపూర్ణాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గానికి గౌరవ అధ్యక్ష, కార్యదర్శులుగా వికాస అధ్యక్షుడు టి. అనిల్ కుమార్, కార్యదర్శి కె శ్రీనివాసరావు సలహాదారులుగా కోడూరి కనకరాజు, అజయ్‌బాబు వ్యవహరిస్తారని నూతన కార్యవర్గ నాయకులు తెలిపారు.

ప్రకృతి సేద్యం ఉద్యోగుల జీతాలు చెల్లించాలి

గోరంట్లలోని రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా

గుంటూరు రూరల్: ప్రకృతి సేద్య విభాగం ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో 16 నెలల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు గోరంట్లలోని రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఉన్నతాధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రకృతి సేద్య ఉద్యోగుల పోరాటానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీల ఫోరం తరపున మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణమూర్తి కె.హరిబాబు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వీ నరసింహారావు తదతరులు మాట్లాడారు. ధర్నా అనంతరం రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావుకు ఉద్యోగులు వినతిపత్రం అందించారు. స్పందించిన సీఈవో జీతాలు విడతల వారీగా చెల్లించేందుకు అంగీకారం తెలిపారు. ఉద్యోగులు దిగువ స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో ఒక గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు ఉద్యోగులు గోరంట్ల వేంకటేశ్వరస్వామి దేవస్థానం సెంటర్ నుంచి రైతు సాధికారిక సంస్థ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, వరప్రసాద్, సీఐటీయూ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఉద్యోగులు



రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కేంద్ర బడ్జెట్‌పై సదస్సు

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర బడ్జెట్ 2024–25పై సదస్సు జరిగింది. విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.శివరామ్ ప్రసాద్ ఈ సదస్సులో అధ్యక్షోపన్యాసం చేస్తూ ప్రస్తుత ఆర్థిక పరిస్థితులలో కేంద్ర బడ్జెట్ అత్యంత ప్రాముఖ్యం సంతరించుకుందని ఆర్థికాభివృద్ధి, ఉపాధి, పెట్టుబడులకు, అంతర్జాతీయ వ్యాపారంలో పురోభివృద్ధి సాధించేందుకు ఈ బడ్జెట్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్ అనుకూలంగా ఉందన్నారు. ముఖ్య అతిథి యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగ అధ్యాపకులు ఆచార్య సీఎస్ఎన్ రాజు పలు రకాల లోటు బడ్జెట్‌ల గురించి వివరిస్తూ ద్రవ్య లోటు 4.9 శాతానికి తగ్గించడం మంచి పరిణామం అన్నారు. వస్తువులు, స్వల్ప దీర్ఘకాల మూలధన, ఆదాయాలపై పన్నును సమర్థించారు.